క్లుప్తంగా

38 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

గంగవరం: మండలంలోని జడేరు గ్రామంలో రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 38 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. రామకృష్ణ మిషన్ ప్రతినిధి స్వామిజీ మాట్లాడుతూ ప్రతి నెల మూడో శనివారం జడేరులో వైద్య శిబిరం నిర్వహించి, గిరిజనులకు సేవలందిస్తున్నామన్నారు. డాక్టర్ శ్రీనివాస్‌రాయుడు , సంచార వైద్యశాల ఇన్‌చార్జి కె.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ మృతికి సంతాపం



చీడి బేబీ (ఫైల్)

రాజవొమ్మంగి: మండల కేంద్రం బీసీ కాలనీ కేంద్రంలోని అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్న చీడి బేబీ (52) శనివారం తన ఇంటి వద్ద మృతి చెందారు. గత నాలుగు రోజులుగా అనారోగ్యంతో ఉన్నారని, పరిస్థితి విషమించి ఆమె మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతికి సహచర సిబ్బంది తదితరులు సంతాపం తెలిపారు.

అసత్య ఆరోపణలు తగవు



నూకరాజు, జెడ్పీటీసీ సభ్యుడు

కొయ్యూరు: భూ ఆక్రమణలు చేసినట్టు తనపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదని జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు చెప్పారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ పేదల భూములను తాను ఆక్రమించినట్టు ఆదివాసీ జేఏసీ నాయకుడు రామారావు దొర ఆరోపణలు చేస్తున్నారని, దాన్ని నిరూపిస్తే పార్టీకి, పదవికి రాజీనామా చేస్తానని, లేని పక్షంలో ఆరోపణలు చేసిన నాయకుడు జేఏసీ నుంచి తప్పుకోవాలని స్పష్టం చేశారు. పేదలకు భూములు పంచాలని పోరాటాలు చేసిన తనపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఇకపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు.

వాహనం ఢీకొని ఒకరికి గాయాలు



సీహెచ్‌సీలో క్షతగాత్రుడు మంగ్లన్నను పరామర్శిస్తున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి

ముంచంగిపుట్టు: మండలంలోని వనుగుమ్మ పంచాయతీ తర్లగూడ గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో గిరిజనుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండల కేంద్రంలో శనివారం జరిగిన సంతకు తర్లగూడ గ్రామానికి చెందిన పాంగి మంగ్లన్న వచ్చి తిరిగి సొంత గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గ్రామ సమీపంలో ఒడిశా వైపు నుంచి వచ్చిన బోలెరో వాహనం ఢీకొట్టింది. కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు హుటాహుటిన ప్రైవేట్ వాహనంపై ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు. విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ శిరగం భాగ్యవతి, నేతలు సాధురాం, దేవా, పిత్‌బాష్, రాంప్రసాద్, పులిరాజు, సచివాలయ కన్వీనర్లు లక్ష్మీనారాయణ, ధన్యలు సీహెచ్‌సీకి వెళ్లి బాధితుడు మంగ్లన్నను పరామర్శించారు.ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

కమనీయంగా శివపార్వతుల కల్యాణం

మాడుగుల: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు శివాలయాల్లో శనివారం ఉదయం శివపార్వతుల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. మాడుగుల కృష్ణా భూపాలేశ్వర స్వామివారి దేవాలయంలో స్వామిఅమ్మవార్ల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనాథు శ్రీనివాసరావు పర్యవేక్షణలో ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఉబ్బలింగేశ్వర స్వామి, ఉమాపార్వతి భీమేశ్వర, తదితర ఆలయాల్లో శివరాత్రి సందర్భంగా తెల్లవారుజాము నుంచి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

హర హర మహాదేవ

- ఘనంగా శివరాత్రి వేడుకలు
- మార్మోగిన శివ నామస్మరణ
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు



కురిడిలో పూజలు చేస్తున్న భక్తులు



పవనగిరి క్షేత్రంలో స్వామి వారికి అభిషేకాలు చేస్తున్న భక్తులు



చట్టిలో స్వయంభూ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు



వడ్డిగూడెంలోని రుద్రకోటేశ్వర స్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



భక్తులతో కిటకిటలాడిన అంతర్ల శివాలయం



పెదలబుడులోని భక్తులకు హారతులిస్తున్న అరకు సీఐ దేముడుబాబు, సర్పంచ్ దాస్‌బాబు



రాజవొమ్మంగిలో రామలింగేశ్వరస్వామి వారికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

దుంబ్రిగుడ: మహాశివరాత్రి పర్వదినాన శనివారం భక్తుల శివనామస్మరణలతో గిరులు తరులు పులకించాయి. కోరిన కోర్కెలు తీర్చే భోళాశంకరునికి విశేష పూజలు జరిపారు. జిల్లా వ్యాప్తంగా మహాశివరాత్రి వేడుకను ఘనంగా జరుపుకున్నారు. శైవక్షేత్రాలతో పాటు ఆలయాలన్నీ భక్తులతో కళకళలాడాయి. తెల్లవారుజామున పుణ్యాస్నానాలాచరించిన భక్తులు ఆలయాలకు తరలివచ్చారు. ఈ సందర్భంగా భోళాశంకరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వామి వారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. మధ్యాహ్నం భారీ సమారాధన కార్యక్రమాలు జరిగాయి. భజనలు, భక్తి గీతాలు ఆలపించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పోలీసులు పటిష్ట భద్రత చర్యలు చేపట్టారు. ఉత్సవాల, ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు ఉపవాస దీక్ష ఆచరించి, తెల్లవారుజామున వరకు జాగరణ చేశారు.

పాడేరు/ దుంబ్రిగుడ/పెదబయలు/చింతపల్లి/కొయ్యూరు/అనంతగిరి: పాడేరు మండల కేంద్రంలోని ఐటీడీఏ పీవో బంగ్లా, పాతపాడేరు, లగిశపల్లి, వంజంగి, తురాయిమెట్ట, బొడ్డాపుట్టు, గెడ్డంపుట్టు, తామరాపల్లి, వంట్లమామిడి, కోలుపుట్ట, తుమ్మరిమెట్ట ప్రాంతాల్లోని శైవక్షేత్రాల్లో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. దుంబ్రిగుడ మండలంలోని కురిడి గ్రామంలో భ్రమరాంభ సహిత మల్లికార్జున స్వామి ఆలయం భక్తులతో కళకళలాడింది.అరకులోయ, దుంబ్రిగుడ మండలంలోని కురిడి, పెదలబుడు, నందివలస శివాలయాల్లో అరకు సీఐ జి.దేముడుబాబు పూజల్లో పాల్గొని భక్తులకు హారతులిచ్చారు. పెదబయలు మండలంలోని కిముడుపల్లిలోని పురాతన శివకేశవులు ఆలయంతో పాటు స్థానిక భీమలింగేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.ముంచంగిపుట్టు మండలంలోని పెదగూడ గ్రామంలో నీలకంఠేశ్వర ఆలయంలో జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, భర్త మూర్తి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మీ, భర్త నర్సింగ్‌రావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.ముంచంగిపుట్టు, దార్రెల, చెరువుపాకల, డేగలపుట్టు, గుంజిరిసంత్, బాబుశాల గ్రామాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. చింతపల్లి మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం కింతర్ల ఆలయంతో పాటు పలు ఆలయాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. కొయ్యూరు మండల కేంద్రంలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంతో పాటు పెదమాకవరం, గాదేగుమ్మి, ఎం.మాకవరం తదితర ప్రాంతాల్లోని శైవక్షేత్రాలు భక్తులతో కళకళలాడాయి.

వై.రామవరం/మోతుగూడెం/కూనవరం/వీఆర్ పురం/చింతూరు: వై.రామవరం మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం గురమంద విశ్వనాథుని ఆలయం , పూతిగుంట పరమేశ్వరుని ఆలయాల్లో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. మోతుగూడెంలోని పొల్లూరు, మోతుగూడెం శివాలయాలతో పాటు అటకేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూనవరం మండల కేంద్రంలో శబరి, గోదావరి నదుల సంగమ తీరంలో కొలువైన శబరి దుర్గాంబ సంగమేశ్వరస్వామి వారి ఆలయం, గొమ్ముగూడెం గ్రామ పరిధిలోని కుమారస్వామి గుట్టపై వల్లీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి.వీఆర్ పురం మండలంలోని వడ్డిగూడెం రుద్రకోటేశ్వర స్వామి, రేఖపల్లి అన్నపూర్ణా సమేత కాశీవిశ్వనాథ ఆలయాలతోపాటు అన్ని శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చింతూరు మండలం చట్టిలో స్వయంభు గాదె రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ముగ్గుల, ఆటల పోటీలు

జి.మాడుగుల: మండలంలోని గడుతూరు రామలింగేశ్వర స్వామి తీర్థ మహోత్సవాలు (శనివారం, ఆదివారం)రెండు రోజులు పాటు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ముగ్గులు పోటీలు, వాలీబాల్ పోటీలను ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసింది. నుర్మతి ఔట్‌పోస్టు, జి.మాడుగుల సీఆర్‌పీఎఫ్–198బిఎస్ డీఎస్పీ కె.సి.రాజా, ఇన్‌స్పెక్టర్ ఝాన్సీరామ్, సంతబయలు శివాలయంలో ఉత్సవ కమిటీ అధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమం జరిగింది.

జడ్డంగి తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంతో పాటు జడ్డంగి కొండగుహలో స్వయంభూగా వెలసిన భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయం, సమీప అడవుల్లో గల కుంతీ లింగేశ్వరస్వామి, వాతంగి జలపాతం వద్ద గల వనదుర్గసమేత నాగమల్లేశ్వరస్వామి వారిని, బట్టావారివీధిలో బుడిబుడి జంగమేశ్వరస్వామివారిని, కిర్రాబులో నీలకంఠేశ్వర స్వామి ఆలయాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. జడ్డంగిలో జరుగనున్న నాలుగు రోజుల తిరునాళ్ళకు అశేషంగా భక్తులు పోటెత్తారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం, గిరిజన సహకార సంస్థ నిత్యావసర వస్తు విక్రయశాలల్లో భక్తులకు సేవలు లభించాయి.

కనులపండువగా శివపార్వతుల కల్యాణం

ఎటపాక: గొల్లగూడెంలోని ప్రముఖ శైవక్షేత్రం దత్తాత్రేయుడి ఆలయంతో పాటు గన్నవరం, బుట్టాయిగూడెం, నెల్లిపాక, వెంకటరెడ్డిపేటలోని పురాతన శివాలయాలు భక్తులతో కళకళలాడాయి. ఆలయాల్లో రాత్రి జరిగే శివపార్వతుల కల్యాణానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీలు తెలిపాయి.

వైభవంగా భువనేశ్వరి సమేత అమరవల్లభేశ్వరుని కల్యాణం

అడ్డతీగల: పవనగిరి క్షేత్రం భక్తులతో కళకళలాడింది. భువనేశ్వరి సమేత అమరవల్లభేశ్వరునికి కల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు వెంకటరామయ్య దంపతులు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కుమారస్వామి గుట్టపైన వల్లీ సుబ్రమణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



గొల్లగూడెం శివాలయం వద్ద భక్తులు



పాల్లూరులో పూజలు చేస్తున్న భక్తులు



కురిడిలో థింసా నృత్యం చేస్తున్న భక్తులు



పెదబయలు భీమలింగేశ్వర ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



కొయ్యూరులోని మల్లికార్జున ఆలయంలో పోటెత్తిన భక్తులు



వై.రామవరంలోని గురమంద విశ్వనాథుని ఆలయంలో పూజలు చేస్తున్న సీఐ రాంబాబు దంపతులు



జి.మాడుగులలో అన్నసమారాధన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న సీఆర్పీఎఫ్ డీఎస్పీ కెసీ రాజా

వెతలు తీరేదెన్నడో!

- నిండుకుండలా సూరంపాలెం జలాశయం
- రబీకి నీరందించాలని రైతుల వినతి



సూరంపాలెం జలాశయం

గంగవరం : గంగవరం మండలం సూరంపాలెం సమీపంలో బురద కాలువపై నిర్మించిన జలాశయం (కోర్పు వెంకటరామకృష్ణ జలాశయం) నేడు నిండుకుండలా కళకలాడుతోంది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయి, ఆయన చేతుల మీదుగానే 2006లో ప్రారంభించబడింది.

వేలాది ఎకరాలకు సాగునీరు

మండలంలోని తొమ్మిది గిరిజన గ్రామాల్లో సుమారుగా 3,466 ఎకరాలకు, గోకవరం మండలంలో ఆరు గ్రామాల్లో 5,790 ఎకరాలకు, కోరుకొండ మండలంలో మూడు గ్రామాలకు చెందిన 4,403 ఎకరాలకు, రాజానగరం మండలంలో కలవచర్ల గ్రామానికి చెందిన 1,821ఎకరాల భూములకు ఈ రిజర్వాయర్ ద్వారా 15,482 ఎకరాల భూములకు ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టుకు సాగుకు నీరు అందించే లక్ష్యంతో ఈ రిజర్వాయర్ నిర్మాణం జరిగింది. ఈ రిజర్వాయర్ పూర్తిగా వర్షాధారంపై ఆధారపడి ఉండడంతో ఖరీఫ్ సీజన్‌కు మాత్రమే సాగు నీరును విడుదల చేస్తున్నారు. వర్షాలు బాగా పడితే ఈ రిజర్వాయర్ నీటిమట్టం పూర్తిస్థాయి ఎఫ్ఆర్ఎల్ స్థాయిని మించి వరద నీరు జలాశయంలోకి ప్రవేశిస్తుంది. ఎఫ్ఆర్ఎల్ స్థాయి 105 మీటర్ల మించి ఉన్న వరద నీటిని దిగువ ప్రాంతానికి వదలేస్తున్నారు. ఏటా రిజర్వాయర్‌లో భారీగా నీరు చేరుతుండడంతో సూరంపాలెం జలాశయం ద్వారా రబీకీ సాగు నీరు అందించాలని ఆయకట్టు రైతులు ప్రతీ ఏటా డిమాండ్ చేస్తూనే ఉన్నారు.

నిరాశలో రైతులు

ఈ ఏడాది వర్షాలు బాగా పడడంతో రిజర్వాయర్ జలకళతో నిండి ఉన్నా రబీకీ సాగుకు నీరు ఇవ్వక పోవడంతో రబీ సాగు చేసే ఆయకట్టు రైతుల్లో నిరాశ వ్యక్తమవుతోంది. రిజర్వాయర్‌లో పూర్తి స్థాయిలో నీరు ఉండడంతో రబీ సాగుకు రైతులు సిద్ధమై నారుమడుల వేసుకున్నారు. అయితే రిజర్వాయర్ కెనాల్ రిపేర్లు, అభివృద్ధి పనులు వలన రబీకి నీరు విడుదల చేసేందుకు అధికారులు నిరాకరించారు. దీంతో రబీకి సిద్ధమైన రైతుల్లో తీవ్ర నిరాశకు గురైయ్యారు. ఏటా సూరంపాలెం రిజర్వాయర్ ద్వారా రెండో పంటకు(రబీకి) సాగునీరు ఇవ్వాలని ఇటీవల జరిగిన మండల పరిషత్ సమీక్షా సమావేశంలో కో–ఆప్షన్ సభ్యుడు కె.ఎస్.ప్రభాకర్ తెలియజేయగా ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబిరత్నం, ఎంపీటీసీ సభ్యులు తీర్మానాన్ని ఆమోదించారు. వచ్చే ఏడాది నుంచి రబీకి నీరు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతుల పక్షాన స్థానిక ప్రజా ప్రతినిధులు , వైఎస్సార్‌సీపీ నాయకులు నీటిపారుదలశాఖ అధికారులను కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి సమస్య



ఈ సమస్యపై రైతులు అడుగుతున్నారు. వేసవిలో మెయిన్ కెనాల్ మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. రబీకి నీరందించే అంశం ఉన్నతాధికారులు దృస్టికి తీసుకెళ్తాం. ఖరీఫ్ పంటకు మాత్రమే పూర్తిస్థాయిలో నీరందించే అవకాశాలు తమ పరిధిలో ఉన్నాయి.

– రమేష్, డీఈ, సూరంపాలెం ప్రాజెక్టు

గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశం రేపు

జి.మాడుగుల: మండలంలో గల గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీ, సర్పంచ్‌లతో సోమవారం ఉరుము గ్రామంలో సర్పంచ్ కిముడు రాంబాబు ఇంటి ఆవరణలో సమావేశం నిర్వహిస్తున్నట్టు మండల కన్వీనర్ కల్యాణ్ తెలిపారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆదేశాల మేరకు సమావేశం జరుపుతున్నట్టు పేర్కొన్నారు. మండలంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులందరూ హాజరుకావాలని ఆయన తెలిపారు.

22న రాజేంద్రపాలెంలో

కొయ్యూరు: రాజేంద్రపాలెంలోని అల్లూరి కళా మందిరం వద్ద ఈనెల 22న జగనన్నే మా భవిషత్ అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ముఖ్య అతిథిగా విచ్చేస్తారని, పార్టీ గృహ సారథులు, కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

ఘనంగా సింహాద్రప్పన్న గరిడీ, తోడపెద్దు సేవ



చౌడువాడలో కాశీవిశ్వేశ్వరాలయంలో పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



సింహాద్రప్పన్న సామూహిక గరిడీ సేవ

కె.కోటపాడు: చౌడువాడలో సింహాద్రప్పన్న సామూహిక గరిడీ, తోడపెద్దు సేవా కార్యక్రమాలు రెండో రోజు శనివారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా సింహాద్రప్పన్న మండపంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక పూజలు చేశారు. ఆచార సంప్రదాయాలను కొనసాగిస్తున్న ధనిమిశెట్టి, సియ్యాద్రి కుటుంబాలను ప్రత్యేకంగా అభినందించారు. గరిడీ, తోడపెద్దు సేవలో పాల్గొనేందుకు చీపురుపల్లి, బొట్టవానిపాలెం, ముద్దుర్తి, కొత్తపల్లి, గొల్లలపాలెం, దళాయిపాలెం గ్రామాల నుంచి లక్ష్మీ నృసింహస్వామి దాసులు వచ్చారు. మూడు రోజుల పాటు వీరు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు గ్రామపెద్ద ధనిమిశెట్టి అప్పారావు వివరించారు.

శివాలయాల్లో డిప్యూటీ సీఎం పూజలు

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా కె.కోటపాడు, చౌడువాడ, ఎ.కోడూరు, గొండుపాలెం, ఆనందపురం గ్రామాల్లోని శివాలయాల్లో పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కె.కోటపాడు భీమలింగేశ్వరాలయం, చౌడువాడ కాశీ విశ్వేశ్వరాలయాల్లో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, రాజి శ్రీనివాసరావు, వారాది అప్పారావు, ఆకుల సాయి ప్రసాద్, చల్లా సురేష్, కుంచా నాగేశ్వరరావు, తనకల అప్పలకోటి, రాజి అప్పలనాయుడు, చిన అప్పారావు, మాలిబాబు, కొండ, సియ్యాద్రి పైడిబాబు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఎడ్ల పోటీల విజేత అర్జునగిరి



దేవరాపల్లిలో హోరాహోరీగా ఉరకలేస్తున్న ఎడ్లు

దేవరాపల్లి: జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పోటీల విజేతగా అర్జునగిరి మరిడిమాంబ ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. దేవరాపల్లి శివారు ఒడ్డు చింతల కల్లాల్లో దేముళ్లమ్మ పేరంటాలు తీర్థాన్ని పురస్కరించుకుని శనివారం నిర్వహించిన ఈ పోటీలు హోరా హోరీగా సాగాయి. జిల్లా వ్యాప్తంగా 25 ఎడ్ల బళ్లు పాల్గొన్నాయి. వీటిలో కె.ఎల్.బి. పట్నం సిరికి దుర్గాప్రసాద్ ఎడ్లు ద్వితీయ, చుక్కపల్లి మజ్జి రాజేష్ ఎడ్లు తృతీయ, లెక్కలవానిపాలెం పైడితల్లమ్మ ఎడ్లు నాలుగు, వావిలపాడు మరిడిమాంబ ఎడ్లు ఐదు, నర్సాపురం సంపత్‌వినాయక ఎడ్లు ఆరు, అర్జునగిరి మరిడిమాంబ ఎడ్లు ఏడో స్థానంలో నిలిచాయి. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు నగదు బహుమతులను ప్రదానం చేశారు. ముందుగా దేముళ్ల పేరంటాలను డిప్యూటీ సీఎంతోపాటు మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపు రెడ్డి సింహాచలంనాయుడు, లలితానాయుడు, చల్లా తాతయ్యలు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల కోలాట ప్రదర్శన...

దేవరాపల్లి శివారు తగరంపూడి వారి కల్లాల వద్ద నాగమణి పేరంటాలు తీర్థం ఘనంగా జరిగింది. పేరంటాల అమ్మవారిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనను ఆసక్తిగా తిలకించి అభినందించారు. మండల సచివాలయ, గృహసారథుల కన్వీనర్ కె.వి.రమణ, వేచలపు అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా పోతురాజుబాబు తీర్థం

మాడుగుల: మహా శివరాత్రి పురస్కరించుకుని మాడుగుల సమీపంలో మామిడి వారి కళ్లాల వద్ద పోతురాజుబాబు తీర్థం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్వామివారిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఎడ్ల బళ్ల పరుగు పోటీలు, పలు క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంపీపీ రామధర్మజ, సర్పంచ్ కళావతి, ఎంపీటీసీ విజయలక్ష్మి, పోలిమేర చిన్నారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న తిరువీధి

మునగపాక : స్థానిక ఇందిరమ్మ కాలనీలో శనివారం రాత్రి వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తి తిరువీధి నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల కోలాటం అందరినీ ఆకట్టుకుంది. ఊరేగింపు కాలనీలోని ప్రధాన వీధి మీదుగా మెయిన్‌రోడ్డుకు చేరుకుంది. భక్తులు పెద్ద ఎత్తున శ్రీనివాసుడిని దర్శించుకున్నారు.